క్లుప్తంగా

ఆత్మీయుల ఐక్యతకు చిహ్నం రాఖీ పౌర్ణమి



జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి రాఖీ కట్టిన చిన్నారులు

ఏలూరు(మెట్రో): ఆత్మీయుల ఐక్యతకు చిహ్నం రాఖీ పౌర్ణమి అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం రక్షా బంధన్ పురస్కరించుకుని పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సొసైటీ ఆధ్వర్యాన స్థానిక కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పలువురు చిన్నారులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి కాసేపు పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చాక్లెట్లు, మిఠాయిలు పంచారు. విభిన్న ప్రతిభావంతులైనప్పటికీ ఏ మాత్రం కృంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఎం.మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

మొండికోడులో వైభవంగా సంతోషి మాత ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలూరు రూరల్: కొల్లేరు ప్రజల కొంగు బంగారం శ్రీ సంతోషి మాత పుట్టినరోజు ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఏలూరు మండలం మొండికోడులోని ఆలయంలో ఉదయం 6 గంటలకు అర్చకుడు బొద్దూరి మురళీధర్ శర్మ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక పూలు, శతనామ స్తోత్రాలతో పూజలు చేశారు. ఏటా రాఖీ పౌర్ణమి నాడు జరిగే అమ్మవారి ఉత్సవానికి కొల్లేరు గ్రామాల నుంచి అన్నాచెల్లెళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం చెల్లెళ్లు అన్నలకు రాఖీ కట్టారు. మహిళలు పండ్లు, పిండి వంటలు, చీరెలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసింది.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బహుజన సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రజా గాయకుడు గద్దర్‌కు స్థానిక రామచంద్రరావు పేటలోని బహుజన సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు మత్తే బాబీ మాట్లాడుతూ తన ఉద్యమగానంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశ వ్యాప్తంగా కీర్తింపబడిన గద్దర్ అకాల మరణం తెలుగు ప్రజలు, సామాజిక ఉద్యమకారులకు తీరని లోటన్నారు. గద్దర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉన్నమట్ల విజయకుమారి, నియోజకవర్గ కన్వీనర్ పిట్టా రాహుల్, జిల్లా మహిళా సభ్యురాలు గండికోట రాణి, తీయాల శరత్, సింగిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో 110వ రోజూ కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అమలు చేస్తోన్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, పేదల అభ్యున్నతికే నిరంతరం జగనన్న శ్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం 110వ రోజూ కొనసాగింది. వన్‌టౌన్‌లోని 9వ డివిజన్ కత్తేపువీధిలో ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే నానికి అపూర్వ స్వాగతం లభించింది. డివిజన్‌లోని ప్రతి గడపకు వెళుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలకు పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సమాజంలో మహిళల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇంటికి వెలుగు ఇల్లాలే అనే నానుడిని నిజం చేస్తూ ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతోనే అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా ఉంటూ అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన వాటా కల్పించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ఆర్థికంగానూ బలోపేతం చేస్తూ రుణాలు మంజూరు చేశామని, రాజకీయంగానూ నామినేటెడ్ పదవుల్లోనూ అగ్రతాంబూలం మహిళలకే దక్కిందన్నారు. మహిళా రక్షణకు సైతం పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు, పోక్సో కోర్టులు ద్వారా బాధిత మహిళలకు సత్వర న్యాయం అందించేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, వాణిజ్య విభాగం నాయకుడు మోటమర్రి సదానందం, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ యుగంధర్ ప్రసాద్, కోరాడ బాబు, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్, లూటుకుర్తి సుభాష్, పిట్టా ధనుంజయ్, లక్కోజు గోపి, కార్పొరేషన్ పీవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు 9వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు సీఎం జగన్ లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డు సభ్యుడు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ అన్నారు. గురువారం సత్రంపాడు అంబేద్కర్ కాలనీలో మోర్ల సుభద్ర, సురేష్ దంపతులు జగనన్న ఇళ్లలో భాగంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో కేటాయించిన 26 వేల ఇళ్ల లబ్ధిదారులు ఎటువంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హౌసింగ్ అధికారులను ఆదేశించడమే కాక, ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సంక్షేమమే కాకుండా ఏలూరు నగరాభివృద్ధి కోసం అమృత నగర్ పథకం ద్వారా కోట్లాది రూపాయలతో పనులు చేపడుతూ నిరంతరం శ్రమిస్తున్న ఆళ్ల నానిని రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

ఏలూరు రూరల్: రాజకీయ పార్టీలు, వర్గ భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం ఏలూరు మండలం శ్రీపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హత ఉన్నవారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఆశయం సైతం ఇదే అన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు చేయడంపై పలువురు మహిళలు ఎమ్మెల్యే వద్ద సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి ఆయన ఆదేశించారు. తొలుత గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, వడ్డీల కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రి సంతోషిణి, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు మండల సరస్వతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, మండల కొండలరావు, సైదు వజ్రంతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీపర్రులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

మున్సిపల్ వర్కర్స్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 30న జరిగిన జిల్లా ప్రథమ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేశ్వరరావు, శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా కూనపాము విఘ్నేశ్వరరావు, కార్యదర్శిగా భజంత్రీ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా తొర్లపాటి బాబు, కోశాధికారిగా ముత్యాల నాగేంద్రరావు, ఉపాధ్యక్షులుగా దొడ్డిగర్ల నాగబాబు, సహాయ కార్యదర్శిగా బొక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా శ్రీరామ్ వెంకటయ్య, వెలగాడి అనురాధ, బొత్స రాజేష్, ముప్పిడి సురేష్, కొత్తూరి శ్రీను, కొత్తూరి నాగేశ్వరరావు, చెన్న చంద్రావతి, ఎలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, సీహెచ్ నాగేశ్వరరావు, ధనియాల రవీంద్ర, సింగంపల్లి అరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆహ్వానితులుగా మడుగుల జగదీష్, పాడుదోలు రమణ, పడిత్య బాలులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్మానించారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించినట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.



కూనపాము విఘ్నేశ్వరరావు, అధ్యక్షుడు



భజంత్రీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి



తొర్లపాటి బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు

ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే ఆళ్ల నానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నిరంతరం శక్తివంచన లేకుండా కృషి చేయాలని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారిగా నియమితులైన మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని పటిష్ట పర్చడంలో ఆళ్ల నాని తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయంలోనూ ఎమ్మెల్యే ఆళ్ల నాని సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. ఆయన సారథ్యంలో జిల్లాలో పార్టీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 2024 ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుని విజయభేరి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నానిని కలిసిన వారిలో ఏఎంసీ డైరెక్టర్లు యుగంధర్ ప్రసాద్, కోరాడ బాబు, పార్టీ 50వ డివిజన్ నాయకుడు గవరపేట నాయుడు తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌కు ఆహ్వానం



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి తమ కుమారుడి పెళ్లి పత్రికను అందజేస్తున్న ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, బలరాం దంపతులు

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పేదవర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని, రాబోయే 2024 ఎన్నికల్లోనూ అఖండ మెజార్టీతో మరోసారి పేదలకు మేలు చేసేలా వైఎస్ జగనన్న సీఎం కావటం ఖాయమని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మధ్యాహ్నపు బలరాం అన్నారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తొలుత పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారి కుమారుడి పెళ్లి పత్రికను ఆయనకు అందజేసి ఆహ్వానం పలికారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎల్‌డీఓ



జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందజేస్తున్న డీఎల్‌డీవో ఏబీపీవీ లక్ష్మి

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. దెందులూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఏబీపీవీ లక్ష్మి డీఎల్‌డీఓగా పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పదోన్నతి ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు వచ్చిన మంచి అవకాశమన్నారు.

ప్రైవేటీకరణపై పోరాటాలకు సిద్ధం కావాలి



ఏలూరులో ధర్నా చేస్తున్న ఇఫ్టూ నాయకులు, కార్మికులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని వీవీ నగర్ ప్రాంతంలో మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ సర్కార్ సంఘటిత, అసంఘటిత, కార్మిక వర్గాల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశ పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు, అరెస్టులు, జైలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ సర్కారు పెట్టుబడిదారీ వర్గంలో ఉన్న అదాని, అంబానీలకు అప్పజెప్పేలా పనిచేస్తోందన్నారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మిక వర్గానికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు సరైనవి కావన్నారు. కార్మికుల హక్కులను హరిస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు ఘంటసాల రమణ, ఎం.రాము, దూళ్ల వీరినాయుడు, కోరాడ అప్పారావు, పల్లి గంగరాజు, బండి నాగేశ్వరరావు, చిట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ వేంద్ర వెంకట స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అభివృద్ధి(డీసీఎంఎస్)కి తమ పాలక వర్గం విశేషంగా కృషి చేస్తోందని సొసైటీ చైర్మన్ వేంద్ర వెంకట స్వామి తెలిపారు. గురువారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో సొసైటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వెంకట స్వామి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు తీర్మానాలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సంఘ రెగ్యులర్ ఉద్యోగులకు ఆరోగ్య బీమా పాలసీ గడువు ఈనెల 16వ తేదీతో ముగియనున్నందున 17వ తేదీ నుంచి ఆరోగ్య బీమా చేయించేందుకు పాలక మండలి అనుమతి పొందడానికి, జిల్లా సహకార ఆడిట్ అధికారిచే జారీ చేయబడిన సంఘ 2022-23 ఆర్థిక సంవత్సరపు ఆడిట్ రిపోర్టును ఆమోదించడానికి తీర్మానాలు చేయాల్సి ఉందన్నారు. దీనితో పాటు సంఘ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 44 ప్రకారం సంఘ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలను సవరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు వీరమల్లు శ్రీనివాసరావు, జంగా వెంకట కృష్ణారెడ్డి, వేంద్ర లక్ష్మి, పెన్మెత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి 'ఐలు' కృషి

ఏలూరు (టూటౌన్): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి తెలిపారు. యూనియన్ ఏలూరు నగర మహాసభ పి.వెకంట్ అధ్యక్షతన స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయవాద గుమస్తాల సంఘ కార్యాలయంలో గురువారం జరిగింది. ముఖ్యఅతిథులుగా మునిస్వామి, మహిళా న్యాయవాదుల రాష్ట్ర కన్వీనర్ ఓరుగంటి శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఐలు జూనియర్ న్యాయవాదుల ప్రయోజనాల కోసం, న్యాయవాదులకు రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన కల్పించడానికి సదస్సులు, మోడల్ టెస్టులు నిర్వహిస్తోందన్నారు. శైలజ మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఐలు కృషి చేస్తోందన్నారు. ఏలూరులో గత 30 ఏళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయ భాస్కర్ యూనియన్ కార్యకలాపాల నివేదికను వివరించారు. మహాసభలో ఏలూరు నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.వెంకట్, కార్యదర్శిగా గెద్దా విజయ భాస్కర్, కమిటీ సభ్యులుగా పి.పరమేశ్వరరావు, వి.శైలజ, ఎస్ఎన్ కట్టా రమేష్‌బాబు, ఎ.శిరీష, కె.మోహనచంద్ర సతీష్, జె.గంగా ఫణీంద్ర లక్ష్మి ఎన్నికయ్యారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, జూనియర్ న్యాయవాదులందరికీ ఐదేళ్ల పాటు నెలకు రూ.10 వేలు రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ అందించాలని, వృత్తి శిక్షణ ఇప్పించాలని, ఏలూరు కోటదిబ్బపై ఉన్న పోక్సో కోర్టును అమీనాపేటలోని హాస్టళ్ల ప్రాంగణంలోకి మార్చాలని ఐలు నగర మహాసభ తీర్మానంలో కోరింది.



ఐలు మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూర్ణిమ పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రావణ పూర్ణిమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్య పూజలు జరిగాయి. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించి సహస్ర దీపోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కొండల అరుణ కుమారి, గోకనబోయిన నాగలక్ష్మి, పద్మావతి భక్త బృందం, లక్ష్మీ పద్మావతి భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	05-08
బెండకాయలు	28	కంద	48
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	32-36	కీరా దోస	34
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	76
క్యాబేజీ	24	అల్లం	120-220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30-32	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07
దోసకాయలు	24-36	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	12-18

సంస్కృతోన్నత పాఠశాలకు వితరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక బాలగంగాధర తిలక్ నగర పాలక సంస్కృతోన్నత పాఠశాలకు కాశీపట్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బెంచీలు మరమ్మతులు చేయించడంతో పాటు సౌండ్ బాక్సులు, ఆంపిల్ వైరు, 50 భోజనం ప్లేట్లను అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన సంస్కృత భాషా దినోత్సవానికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాశీపట్నపు ఇందుశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గౌరవ అతిథి, ఫౌండేషన్ కార్యదర్శి శంకర వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సంస్కృత భాషపై తనకు ఎనలేని గౌరవం ఉందని, భవిష్యత్‌లో తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని ప్రకటించారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ షడ్రక్ మాట్లాడుతూ భారతీయ భాషలకు మాతృక సంస్కృత భాష అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో నాడు-నేడు కింద పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో అధికారులతో మన బడి నాడు-నేడు రెండో దశ పనుల పురోగతిపై గురువారం సమీక్షించారు. పెండింగ్ పనులపై ఆరా తీశారు. పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి పనుల ప్రగతిని వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొందించి వచ్చే సమావేశంలో సమర్పించాలని ఆదేశించారు.